

# అమ్మాయిలకి మాత్రమే!

"ఈ రోజు ఆరుమూడైనా, మూడు ఆరైనా నువ్వు నా రూమ్‌కి రావాలి, తప్పదు. అన్నాను, చేతిమధ్య ఆమె వేళ్ళు బిగిస్తూ.

కమల నవ్వింది.

కమల నవ్వితే వెన్నెల విరిసినట్టుంటుంది. క్రింది పెదవి విల్లులా వంగి, బుగ్గల మధ్య చిన్న నొక్కు పడీపడనట్టుపడి మనోహరంగా వుంటుంది.

అమ్మాయిలకి మాత్రమే!

"చెప్పు" అన్నాను.

"చూద్దాం" అంది.

"అలా అంటే కాదు. ఇప్పటికి ఇలా "చూద్దాం" లతో ఎన్నాళ్ళ నుంచి తప్పించుకొంటున్నావో తెలుసా?"

"మా ఆఫీసులో ఈ రోజు ఏమైందంటే ....."

"మాట మార్చకు, నా ప్రశ్నకు సమాధానం కావాలి!"

కమల క్షణం మాట్లాడలేదు. తరువాత నెమ్మదిగా అంది - "మనం ఇలా కలుసుకుంటున్నాంగా? రూము ఇంకెందుకు?"

ఆ ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పకుండా - "నువ్వు రూముకి ఎందుకు రావో చెప్పు. నామీద నమ్మకం లేదా?" అని అడిగేను.

బెదిరినట్టు నావైపు చూపింది. "అబ్బే! అటువంటి దేమీ లేదు."

అనునయిస్తున్నట్టు అన్నాను - "చూడు కమలా! మనం ఇంకో రెండు నెలలో పెళ్ళి చేసుకోబోతున్నాం. ఏం థ్రిల్ అనుభవించాలన్నా ఈ రెండు నెలలే. నీ క్కాబోయే భర్తమీద నీ క్కొద్దిగా నమ్మకం వుండటం మంచిది ప్లీజ్ డూ కమ్!".

తనలో తను ఆలోచించుకుంటున్నట్టు కమల చాలా సేపు మాట్లాడలేదు. తరువాత నెమ్మదిగా తలయెత్తి - "వస్తాను" అంది.

ఆ మరుసటి రోజు రెండు గంటలు పర్మిషన్ పెట్టి రూమ్‌కి వచ్చేను. కమల ఆఫీసు నుంచి వచ్చేసరికి అయిదున్నర అవుతుంది. నీటుగా రూము ఉంచుకొనే అబ్బాయిల్ని అమ్మాయిలు ప్రేమిస్తారని ఎక్కడో చదివిన గుర్తు. రూమ్ అంతా నీట్‌గా సర్దేసరికి అయిదయింది. స్నానం చేసి, మేకప్ పూర్తి చేసేసరికి అయిదున్నర.

ట్రాన్సిస్టర్ సన్నగాపెట్టి కమలకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను. ఆరు .... ఆరున్నర....ఏడు.......

*　　　*　　　*

కమల రాలేదు.

"మీతో కొంచెం మాట్లాడాలి. చిన్న రిక్వెస్ట్."

తలయెత్తి చూసేను. సుబ్బారావు.

నవ్వి, "చెప్పండి" అన్నాను. సుబ్బారావు కొంచెం తటపటాయించి "ఇప్పుడు కాదు. లంచ్ అవర్లో చెబుతాను లెండి" అన్నాడు. అతనివైపు పరకాయించి చూసేను. ఇంకా అమాయకత్వం పోని బుగ్గలూ నుదుటి మీదకుపడే జుట్టూ, లేత చెక్కిళ్ళూ - ఇరవై రెండు మూడు మధ్య వయసు.

"సరే మీ ఇష్టం" అన్నాను. నేను కొద్దిగా బలవంతం చేస్తే చెప్పేవాడేమో కానీ, అది నాకిష్టం లేకపోయింది.

లంచ్ అవర్లో సుబ్బారావు నన్ను కలుసుకోలేదు. ఎంక్వయిర్ చేస్తే ఇన్‌స్పెక్షన్ మీద

పంపించేనన్నాడు నా ప్రక్క ఆఫీసరు.

*　　　　*　　　　*

"నామీద నీకు కూడా చాలా కోపం వచ్చినట్టుంది" కమల అడిగింది.

"అవును" అన్నాను నిర్లిప్తంగా. హోటల్ అంత రష్‌గా లేదు. ఓమూల కూర్చున్నాం ఇద్దరం.

"ఏం చెయ్యను? అయిదింటికి మా మేనేజర్ కొంత మేటర్ ఇచ్చి, ఎలాగైనా ఈ రోజు అవ్వాలని -"

"అబద్ధులాడకు" మధ్యలో ఆపుచేశాను. "నీకు రావాలని లేదు. రాలేదు. దీనికోసం అబద్ధాలాడి నీమీద నా అభిప్రాయాన్ని పాడుచేసుకోకు.

"ఎందుకంత కోపం?" నవ్వటానికి ప్రయత్నం చేస్తూ అంది.

"కోపం వచ్చిన నేనేం చెయ్యగలను?"

కమల కళ్ళలో ముత్యాల్లాంటి నీటి బిందువులు దీపాల కాంతిలో తళుక్కుమన్నాయి. నా చేతిమీద చేయి వేస్తూ - "నన్ను మన్నించు" అంది.

విచలితుణ్ణి అయ్యాను.

"ఆ రోజు చాలా డిసప్పాయింట్ అయ్యాను, కమలా నిజంగా" "నా కంఠం నాకే చిత్రంగా ధ్వనించింది." "నవ్వు రానందుకు కాదు. నా మోద అంద నమ్మకం లేకపోయినందుకు' " "నమిద నమ్మకం లేక కాదు" తల వంచుకుని నెమ్మదిగా అంది- నామీద కాకు నమ్మకం లేక".

చటుక్కున ముందుకు వంగి, "అదొక్కటే నీ అబ్జెక్షన్ అయితే ఆ విషయంలో గ్యారంటీ ఉంటాను." అన్నాడు.

కమల చిలిపిగా నవ్వి, "దేనికి?" అంది.

"దేనికో నీకు తెలుసు."

"సరే, అయితే."

హుషారుగా లేచాను. "అయితే ఎప్పుడో ఎందుకు?ఇప్పుడే."

కమల మౌనంగా అంగీకారం తెలిపింది.

అరగంటలో నారూమ్‌లో ఉన్నాం ఇద్దరం.

*　　　　*　　　　*

"ఎనిమిదయింది. ఇక వెళతాను." అంది కమల లేస్తూ.

"అప్పుడేనా?"

"ఇంకో రెండు నెలలు పోతే జీవితాంతం ఇక్కడే ఉండిపోవాలిగా?" కమలలో నాకు బాగా నచ్చిన గుణం ఏమిటంటే, ప్రతి వాక్యాన్ని చిరునవ్వుతో మేళవించి మాట్లాడటం. ఎప్పుడూ నవ్వుతూ ఉండటం ఈ అమ్మాయికి దేముడిచ్చిన వరం.

"కో-యిన్సిడెన్స్ మీద నీకు నమ్మకం వుందా?"

అర్థము కానట్టు నావైపు చూసి, "ఎందుకు?" అంది.

"ఈరోజు నువ్విలా నా రూమ్‌కి వద్దామని అనుకోకపోయినా, తెల్ల చీరె కట్టుకోవటం, ఆ మల్లెపూలూ...."

కమల అందంగా సిగ్గుపడి, "చాలు, ఇక మాట్లాడకు" అంది.

"నిజంగా" ఏదో చెప్పబోయాను.

"నేను వెళతాను" ఆమె కళ్ళలో గాభరా.

"ఉఁహు, వెళ్ళనివ్వను."

"ప్లీజ్!"

"కమలా!" ఆర్ద్రంగా పిలిచాను. వెళ్ళబోయిందల్లా ఆగి' వెనక్కి తిరిగింది. "ఐ లవ్‌యూ" చేతులు సాచాను. అప్రయత్నంగా అడుగు ముందుకేసింది. సుతారంగా ఆమె చెంపమీద ముంగురుల్ని వెనక్కి సర్దాను. కళ్ళు మూసుకుంది. నెమ్మదిగా ముందుకు వంగాను. ఆమె నుదుటిమీద చిరుచెమట పట్టింది. కింది పెదవి వణకుతూంది. ఎర్రటి పెదవి అందుకుందామనేసరికీ చేతుల మధ్యలోంచి కిందికి జారిపోయింది ఆమె శరీరం.

"కమలా!" గాభరాగా పిలిచాను. కమల పలకలేదు.

"కమలా, కమలా" తట్టి లేపటానికి ప్రయత్నించాను. లాభం లేకపోయింది. కూజాలో నీళ్ళు కొద్దిగా తీసుకుని మొహం మీద జల్లాను. అప్పుడు కళ్ళు విప్పింది.

"ఎలా వుంది? ఆత్రంగా అడిగాను.

కొంచెం రిలాక్స్ అయి, ఏం లేదు. "బి.పి ఎక్కువై తల తిరిగినట్టుంది" అని నవ్వింది.

నా ఆవేశం పూర్తిగా దిగిపోయింది.

మామూలు మనిషినయ్యాను.

"ఆర్ యూ ఆల్‌రైట్ నౌ?"

'వెరీమచ్ ఆల్‌రైట్ అండ్ థాంక్యూ ఫర్ గివింగ్ దిస్ ఎక్సైటింగ్ ఎక్స్‌పీరియన్స్.'

'ఎక్సైటింగ్ ఎక్స్‌పీరియన్సా ?! అసలేం జరిగింది....'

'వద్దు, వద్దు. ఇంకంతా పెళ్ళయ్యాకే' అంటూ పారిపోయింది.

తలగడలో మొహం దాచుకొని చాలాసేపు ఏదో అవ్యక్తానందాన్ని అనుభవిస్తూ ఉండిపోయాను.

* * *

'మీరేదో రిక్వెస్టు అన్నారు.'

'అవును, గురువుగారూ ! కానీ, అడగాలంటే భయంగా వుంది' అన్నాడు సుబ్బారావు. అతను ఆఫీసులో నాకన్న ఐదు సంవత్సరాల జూనియర్.

"ఫరవాలేదు, చెప్పండీ."

అతను నసుగుతున్నట్టు, 'మీరేమీ అనుకోకూడదు' అన్నాడు.

నాతో అంతగా పరిచయం లేకపోవటం వల్లనే అతనలా అన్నాడని, 'ఏం అనుకోను చెప్పండి.' అన్నాను.

"మీరు ఆఫీసులో చేరిన దగ్గర్నుంచీ గమనిస్తున్నాను, మీరు నిండు కుండలాంటి వారు, ఇంత చిన్న వయసులో అంత గాంభీర్యాన్ని సంపాదించారంటే" నేను నవ్వటంతో ఆపుచేశాడు.

"మీకేం కావాలో చెప్పండి. మొహమాటం వద్దు."

క్షణం ఆగి, నెమ్మదిగా- "ఓరోజు పాటు మీగది కావాలి అన్నాడు.

ముందుకు వంగి ఆశ్చర్యంగా అతనివైపు చూస్తూ, "ఎందుకు?" అన్నాను. సాధారణంగా ఇలా రూములు ఎందుకు అవసరం అవుతాయో నాకు తెలుసు. కానీ, సుబ్బారావు లాటి అమాయకుడికి కూడా అదే అవసరం వస్తుందని నేను అనలేకపోయాను.

"నేనూ, ఒక అమ్మాయీ ప్రేమించుకున్నాం" అన్నాడు.

నవ్వొచ్చింది. ఈ కుర్రావాళ్ళు ఓ చిన్న ఉద్యోగం దొరికి, తమ కాళ్ళమీద నిలబడటం వచ్చేసరికి చాలా పెద్దవాళ్ళమై పోయామని అనుకుంటారు కాబోలు.

"ఆ అమ్మాయి బయటికి రావటానికి ఒప్పుకోవడం లేదు. ఊళ్ళో తెలిసినవాళ్లు చాలా మంది ఉన్నారట."

"మీ ఇద్దరూ పెళ్ళి చేసుకోబోతున్నారా?" అడిగాను.

"లేకపోతే ఇదంతా దేనికి?" అన్నాడు అమాయకంగా.

ఎలాగూ పెళ్ళి చేసుకోబోతూవుంటే ఇంక ఊళ్ళో యెవరన్నా చూస్తే నష్టం ఏముంది?'

"అందర్నీ ఒకేసారి సర్‌ప్రైజ్ చేద్దామని", కారణం అది అయి ఉండదు. ఒక క్షణం మాట్లాడలేదు. తాళం చెవి ఇవ్వడం రిస్క్ అని తెలుసు నాకు. పక్క ఇంటివాళ్ళు ఎవరైనా చూస్తే నేను నాలుగు సంవత్సరాలనుంచీ నిలబెట్టుకుంటూ వచ్చిన పరువు ఒక్క క్షణంలో పోతుంది. కానీ సుబ్బారావు అడిగిన రిక్వెస్ట్‌లో కూడా తప్పేం కనబడలేదు, నాకు. తను పెళ్ళి చేసికోబోయే అమ్మాయితో ఆ మాత్రం ప్రైవేట్‌గా మాట్లాడాలని ఏ అబ్బాయికైనా వుంటుంది. పోతే, సుబ్బారావు స్వతహాగా ధైర్యవంతుడు కాదు కాబట్టి, ఆ అమ్మాయిని పబ్లిక్ గార్డెన్స్‌కీ, హోటల్స్‌కీ తిప్పలేదు.

నావైపే ఆత్రంగా చూస్తున్న సుబ్బారావు మొహం- "ఎప్పుడు కావాలి మీకు ఆ తాళం చెవి?" అన్న నా ప్రశ్నతో విప్పారింది.

"మీ యిష్టం గురువుగారూ, ఎప్పుడైనా సరే" అన్నాడు ఆనందాన్ని దాచుకుంటూ.

"రేపు?"

"ష్యూర్" అన్నాను లేస్తూ. "మీకు థాంక్స్ ఎలా చెప్పుకోవాలో కూడా నాకు తెలియటంలేదు."

నవ్వాను. "శుభలేఖల్లో నా పేరు స్పెషల్‌గా వేయించండి."

అమ్మాయికి మాత్రమే!

సుబ్బారావు కూడా నవ్వి. "రేపు తొమ్మిదింటికి మీ రూముకి వస్తాను" అంటూ వెళ్ళబోయాడు.

"ఇంతకీ అమ్మాయి ఎవరు?"

సుబ్బారావు ఆగి, "సారీ, గురువుగారూ! రేపు సెటిల్ చేసుకుని, ఎల్లుండి అన్ని వివరాలతో చెపుతాను" అని వెళ్ళిపోయాడు.

* * *

ఆ మరుసటిరోజు ఆఫీసులో పనిచేస్తున్నానన్నమాటే కానీ, నా మనసు మనసులో లేదు. రూము దగ్గిర గొడవ ఏమైనా జరిగి ఉంటుందా అన్న అనుమానం దొలిచేయసాగింది.

సరిగ్గా నాలుగింటికి సుబ్బారావు నా దగ్గిర కొచ్చాడు. అతడ్ని చూసి ఆశ్చర్యపోయాను. జుట్టంతా రేగిపోయి, కళ్ళు ఎర్రగ ఉన్నాయి. మొహంలో బాగా అలసట, ఓ విధమైన అసంతృప్తి కనబడుతున్నాయి. వచ్చి నా ముందు కుర్చీలో కూలబడి తాళం నా బల్లమీదకు విసిరేశాడు దాదాపు.

"ఏం జరిగింది?" అడిగాను. నా మనసు ఏదో కీడు శంకించింది.

"ఈ ఆడవాళ్ళను నమ్మకూడదు, గురువుగారూ!"

నా మనసు తేలికపడింది. నా రూము దగ్గిర ఏ గొడవా జరగలేదు. తేలికగా ఊపిరి పీల్చుకుంటూ, "ఆ అమ్మాయి రాలేదా?" అన్నాను.

"వచ్చింది."

"మరి?"

సుబ్బారావు క్షణం మాట్లాడలేదు. తనలో తను క్షణం ఆలోచించుకుని, "ఊహుఁ, ఇక్కడకాదు, గురువుగారూ! బయటికిపోయి మాట్లాడుకుందాం, రండి" అంటూ లేచాడు.

అతడ్ని అంచనా వేయటం నాకు పెద్ద కష్టం కాలేదు. 'ఏదో జరిగింది' అతడు తట్టుకోలేని విషయం.... ఇంక అతను ఆపుకోలేడు. ఇప్పటివరకూ అన్నీ తనలోనే దాచుకున్నట్టున్నాడు. అవుట్‌లెట్ కావాలి ఇప్పుడు. నన్ను యీ సాయంత్రం అంతా తన గొడవతో బోర్ కొట్టబోతున్నాడు అని నిశ్చయం చేసుకుని, "ఎక్కడికి?" అని అడిగాను.

సుబ్బారావు తటపటాయించి, "బార్" అన్నాడు. విస్తుబోయాను. పైకి అమాయకంగా కనిపించేవాళ్ళు ఎంత డబుల్ లైఫ్ లీడ్ చేస్తూ వుంటారు? నా ఆలోచనలని నాలోనే అణుచుకుని, "పదండి" అన్నాను.

ఇద్దరం బార్లో ఓ మూల కూర్చున్నాం. "మీకు అలవాటుందిగా?" అని అడిగాడు.

నాలో నేను నవ్వుకుని, తల ఊపాను. బేరర్‌కి ఆర్డర్ చేసిన తరువాత స్థిమితంగా కూర్చుని, "ఊఁ ఇప్పుడు చెప్పండి" అన్నాను.

"ఈ ఆడవాళ్ళని నమ్మకూడదు. సార్" అన్నాడు.

"ఆ విషయం ఆఫీసులోనే చెప్పారు" అన్నాను విసుగ్గా. "అసలేం జరిగిందో చెప్పండి."

సుబ్బారావు బిక్కమొహం వేసి, "అదే ఎలా చెప్పాలో తెలియటంలేదు" అన్నాడు.

నవ్వొచ్చింది నాకు, మాటల్లో పెడితే తన్ప విషయం బయటికి రావటం కష్టం. "ఆ అమ్మాయి ఎన్నింటికి వచ్చింది?"

"అనుకొన్నట్టు పదిన్నరకి"

"ఎవరూ చూడలేదు కదా?"

"లేదు, ఎవరూ చూడలేదు. అసలు ఎవరికీ అనుమానం కూడా రాలేదు"

"ఎన్నింటివరకూ ఉన్నారు రూములో?"

'తను రెండింటివరకూ ఉండి వెళ్ళిపోయింది. నేను నాలుగింటి వరకూ ఉన్నాను.'

"రెండింటి నుంచీ నాలుగింటివరకూ ఏం చేశారు?"

"ఏడ్చాను."

బేరర్ ట్రేతో గ్లాసులూ, బాటిలూ తీసుకొచ్చి బల్లమీద అమర్చి చెరో గ్లాసులోనూ పెగ్ చొప్పున పోసి, ఐస్ వేసి, సోడా కలిపి వెళ్ళిపోయే వరకూ ఉత్సుకతని అతి కష్టం మీద ఆపుకున్నాను. బేరర్ అటుతిరగ్గానే అడిగాను.

"ఏడ్చారా?"

సుబ్బారావు మాట్లాడలేదు. కొంచెంసేపు అతడ్ని రిలాక్స్ కానిచ్చాను. ఆ ప్రవాహం చెలియలికట్టని దానంతట అదే దాటాలి. గ్లాను తీసుకొని "చీర్స్" అన్నాను, అతనూ అప్రయత్నంగానే గ్లాసు తీసుకుని తాగటం మొదలు పెట్టాడు. చాలాసేపు మౌనంగా ఉన్నాక అతను ప్రారంభించాడు.

"ఆర్నెల్లు పరిచయంవున్న నా మీద తనకంత నమ్మకం లేకపోతే ఎలా, గురువుగారూ?' ' ఆగి, ఒక గుక్క తాగి మళ్ళీ మొదలు పెట్టాడు.

"నేను ప్రేమించటం అంటూ మొదలు పెడితే చాలా సిన్సియర్‌గా ప్రేమిస్తాను."

నాకు విసుగేసింది. ఇరవై రూపాయల ఖర్చుతో ఇతను నన్నీరాత్రి బోరు కొట్టేస్తాడనుకొన్నాను. ఆ ఆలోచన వచ్చాక అతని మీద కాన్‌సన్ట్రేషన్ చూపించాను. ఏకబిగిని అరగంటసేపు మాట్లాడిన దానిలో తేలిన సారాంశం ఏమిటంటే - తను చాలా సిన్సియర్‌గా ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. నిజానికి తను నా తాళం తీసుకున్నది వాళ్ళ పెళ్ళి గురించి సెటిల్ చేసుకోవటానికే. నా రూమ్‌లో మొట్ట మొదటిసారి నాలుగు గోడలమధ్య కలుసుకున్నారు వాళ్ళు. సుబ్బారావు ఆ సమయంలో ఆ అమ్మాయిని సుతారంగా తాకకుండా ఉండలేకపోయాడు. ఆ మాత్రం దానికే ఆ అమ్మాయి దూరంగా తొలిగి పోయింది.

ఈ సంగతి చెప్పేసరికి నాలో ఉత్సుకత పెరిగింది. ముందుకు వంగి "తరువాత ఏం జరిగింది?" అని అడిగాను.

"ఆ అమ్మాయి నన్నసలు ప్రేమించటం లేదు మాష్టారూ ! అది మాత్రం నిజం."

"ఏం? ఎందుకొచ్చింది మీకా అనుమానం?"

"ఇంకా నెలలో పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం. అయినా కూడా కనీసం నన్ను

తాకనివ్వలేదంటే ఆ అమ్మాయికి నా మీద ప్రేమకన్నా, తనపట్ల జాగ్రత్తే ఎక్కువ అన్నమాట. ఆ అమ్మాయి టార్గెట్ పెళ్ళి. దానికోసం నన్ను ప్రేమిస్తునట్టు నటిస్తూంది అంతే!"

ఈ సిద్ధాంతీకరణచూసి, ఆశ్చర్యంతో నేను మాట్లాడలేకపోయాను.

"నిజం మాష్టారూ! ప్రేమంటే ఒకరికొకరు మనఃస్ఫూర్తిగా అప్పగించుకోవటం అని నా నమ్మకం అంతే కానీ, ఇలా గిరి గీసుకుని ప్రేమించటంవల్ల నాకేమీ సదభిప్రాయంలేదు."

"ఆమె స్త్రీ కదా! తన జాగ్రత్తలో తను ఉండటంలో తప్పులేదు అని నా అభిప్రాయం' ' అన్నాను.

"అంటే నా మీద నమ్మకం లేనట్లేగా?"

మాట్లాడలేదు నేను.

'మనిషి మీద మనిషి నమ్మకం పెంచుకోవటానికి ఆరు నెలలు చాలు, మాష్టారూ!'

సుబ్బారావు ఆర్గ్యుమెంటులో ఎక్కడో తప్పు ఉందని నాకు అనిపించింది. ఎక్కడ?

"చూడు సుబ్బారావ్, ఇంకో కోణంలోంచి ఆలోచిద్దాం" అన్నాను. "సపోజ్ -ఆ అమ్మాయి నీ చర్యలకి తన మౌనం ద్వారా అంగీకారం తెలిపిందనుకో. నువ్వా కొత్తగా అనుభవాన్ని పొందుతున్న వాడివేకదా? తొందరపడి ఇంకా ముందుకెళితే...." అప్రయత్నంగా ఏకవచనంలోకి మారాను.

"వెళితే ఏం?" అంటూ నా మాటలకి అడ్డుతగిలాడు. "మేము ఇద్దరం పెళ్ళి చేసుకోబోతున్నాం కదా!"

"ఆ నమ్మకం ఆ అమ్మాయి కేమిటి ?"

తన దారిలోకి నేను పచ్చినట్టు అతని మొహంలో సంతృప్తి కనిపించింది. "కాబట్టి ఆ నమ్మకం లేకుండానే ఆ అమ్మాయి నన్ను ప్రేమిస్తూ ఉందని నమ్మమంటారు?" అన్నాడు.

అతనితో ఇక వాదించి మార్చటం అసంభవం అనిపించి "అయితే, యేం నిశ్చయించుకున్నావు?" అని అడిగాను.

"ఇక నిశ్చయించుకోవటానికి మేం లేదు మాస్టారూ! మేం విడిపోయాం అంతే." గ్లాసులో ద్రవం కేసి సూటిగా చూస్తూ అన్నాడు.

"అయితే ఆరు నెల్లు అతి సిన్సియర్‌గా ప్రేమించి ఇంత తొందరగా ఎలా వదిలిపెట్టెయ్య గలవు?"

"వదిలిపెట్టలేను మాష్టారూ! అందుకే రెండు గంటలు అక్కడే గుండెలో బాధంతా తొలిగిపోయేలా యేడ్చాను". సుబ్బారావుని చూసి జాలేసింది నాకు. అడంగి నవలలు చదివీ, చౌకబారు మెలోడ్రామా సినిమాలు చూపీ, ఈ కుర్రవాళ్ళు ఎంత సెన్సిటివ్‌గా తయారవుతున్నారో చూస్తూ ఉంటే భాధగా ఉంది.

"ఇంతకీ ఎవరా అమ్మాయి ?"

'మన ఆఫీసులోనే పని చేస్తూంది మాష్టారూ....! అక్కౌంట్ సెక్షన్‌లో....సావిత్రి.'

పక్కలో బాంబు పడ్డట్టు ఉలిక్కిపడి 'సావిత్రీ ! ?' అన్నాను. గొంతులో తడి ఆరిపోతూ

ఉండగా, సుబ్బారావు నా వైపు చూడకుండా- 'అవును' అన్నాడు.

చాలాసేపటి వరకూ నేను మాట్లాడలేదు.

నే నాలోచిస్తుంది సరిగ్గా పదింటికొచ్చి సీట్లో కూర్చుని తన పని తాను చేసుకుపోయే సావిత్రి గురించి. నిజంగా ఆ అమ్మాయి ప్రేమని సంపాదించగలిగాడు అంటే సుబ్బారావు అభినందనీయుడే. అంత మంచి అమ్మాయి ఇంకో పదిజన్మలెత్తినా సుబ్బారావుకి దొరకదు.

ఆ విషయమే అతనితో అన్నాను.

బిల్లు పేచేస్తూ "నిజమే, గురువుగారూ!" అన్నాడు సుబ్బారావు. లేచి బయటికి వస్తూంటే సిగరెట్ అందించాడు.

"మీరు ఒక కోణం నుంచి ఆలోచిస్తున్నారు. నేను ఆలోచిస్తున్నది పూర్తిగా వేరే యింకో కోణంలోంచి ఆ అమ్మాయి నన్ను ప్రేమించటం లేదన్న విషయం ఎందుకో నాలో స్థిరపడిపోయింది. ఇక అది పోదు. నా గురించి చిన్నవల విసిరింది. నేను పడలేదు అంతే."

* * *

ఆ తరవాత కొంతకాలం గమనిస్తే సుబ్బారావు తన నిర్ణయాన్ని చాలా పకడ్బందీగా తీసుకొన్నాడని అనిపించింది. ఈ విషయం తెలిసిన తరువాత సావిత్రిని గమనించకుండా ఉండలేకపోయాను. కొంచెం జాగ్రత్తగా చూస్తే ఆ అమ్మాయి మానసికంగా చాలా క్రుంగిపోయినట్టు తెలిసిపోయింది. ఇంతకుముందు ఆమె కళ్ళలోవున్న నిర్మలత్వం స్థానే ఇప్పుడు లీలగా విషాదం గూడు కట్టుకుంది. ఎవరితోనూ అంతగా పరిచయం పెట్టుకునే స్వభావం కాదు. కాబట్టి దీన్ని గురించి ఆఫీసులో అంతగా పట్టించుకొనేవారూ, దీన్ని గమనించేవారూ లేకపోయారు.

రోజులు తొందరగా గడుస్తున్నాయి. ఒకరోజు సుబ్బారావు శుభలేఖ తెచ్చి ఇచ్చాడు. ఎవరో వెంకటలక్ష్మి. మామూలుగానే కంగ్రాచ్యులేషన్స్ చెప్పాను. థాంక్స్ చెప్పి వెళిపోయాడు. చిత్రమేమిటంటే.... ఆ సంఘటన జరిగిన తరవాత సుబ్బారావు దాదాపు నన్ను తప్పించుకొని తిరగసాగాడు. బహుశా సావిత్రి విషయం తన దగ్గిర ఎత్తుతాననే భయం అయివుండవచ్చు. సుబ్బారావు పెళ్ళిరోజు సావిత్రి సెలవు పెట్టింది. కారణం నా ఒక్కడికే తెలుసేమో? ఆ మరుసటి రోజు ఆమె ఉబ్బిన కళ్ళను చూసి, ఆ క్రితం రోజంతా యేడ్చి ఉంటుందని గ్రహించాను. సుబ్బారావుని చంపేద్దామన్నంత కోపం వచ్చింది. అతని వాదం -- అది అమాయకత్వంతో కూడుకొన్నదైనా, అతితెలివివల్ల వచ్చిందైనా -- ఒక నిండు జీవితాన్ని నాశనం చేసిందన్న మాట మాత్రం నిజం.

ఒక సంవత్సరకాలం గిర్రున తిరిగింది. సుబ్బారావు తండ్రి అయ్యాడు. సావిత్రికి ఇంకా పెళ్ళికాలేదు. ఒకరోజు భాస్కర్రావు నా కాబిన్‌కి వచ్చి ఈ కథని ఇంకో మలుపు తిప్పాడు.

* * *

"సావిత్రిమీద మీ అభిప్రాయం యేమిటి?" అని అడిగాడు భాస్కర్రావు, ఉలికిపాటును కప్పిపుచ్చుకొంటూ,

అమ్మాయికి మాత్రమే!

"ఎందుకు ?" అన్నాను నవ్వి.

"ఆ అమ్మాయిని నేను పెళ్ళి చేసుకోవాలనుకొంటున్నాను" అన్నాడు.

మనస్ఫూర్తిగా చెయ్యి ముందుకు చాచి, ఆనందంతో -- 'కంగ్రాచ్యులేషన్స్ !' అన్నాను. నిజానికి సుబ్బారావు కంటే భాస్కర్రావు మంచి పొజిషన్లో ఉన్నాడు. ఇంకా పైకి పోగలిగిన తెలివి తేటలున్న వాడు. సావిత్రి సుబ్బారావుని వదులుకోవటం ద్వారా అదృష్టవంతురాలయింది.

"ఆ అమ్మాయిని చూశావుగా? రెండు సంవత్సరాల నుంచీ మన ఆఫీసులో పనిచేస్తున్నా, తన పనితప్ప ఇంకో విషయంలో జోక్యం కల్పించుకోదు. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడదు" అని ఆగి, "అటువంటి అమ్మాయి కోసమే నేను ఇన్నాళ్ళూ వెతుకుతున్నాను" అన్నాడు.

నిజమే ననిపించింది. వేర్వేరు ధ్రువాలు ఆకర్షింపబడటం అంటే ఇదేనేమో? భాస్కర్రావు ఆఫీసులో చాలా హుషారుగా తను నవ్వుతూ, అందర్నీ నవ్విస్తూ ఉంటాడు. అతనికి ఇద్దరు, ముగ్గురు గర్ల్ఫ్రెండ్స్ ఉన్న విషయమూ, ఆఫీసులో పెళ్ళయిన అమ్మాయిలు కూడా అతనంటే ఇంటరెస్టు చూపించే సంగతీ నాకు తెలుసు. కానీ, పెళ్ళికాక ముందు ఆ మాత్రం చరిత్ర లేనివాడు అసలు మగవాడు కాడనే నా ఉద్దేశ్యం. అందువల్ల అతను ఆ అమ్మాయిని చేసుకుంటాడన్న సంగతి తెలిసి చాలా ఆనందించాను. కానీ, ఈ విషయం సుబ్బారావు మీద తన ప్రభావం ఎలా చూపిస్తుంది ?

ఈ ఆలోచన వచ్చేసరికి ఉలిక్కిపడ్డాను. సుబ్బారావులాంటి ఆలోచనా రహితుడు దీనికి ఎలా రియాక్ట్ అవుతాడు?

ఆ రోజు సాయంత్రం సుబ్బారావుని బార్కి ఆహ్వానించాను, ఈ సంవత్సరం కాలంలో దానికి బాగా అలవాటు పడ్డట్టున్నాడు. ముందు ఆశ్చర్యపోయినా, వెంటనే ఒప్పుకొన్నాడు.

* * *

బార్లో కూర్చున్న తరువాత అడిగాను-సావిత్రిని భాస్కర్రావు పెళ్ళి చేసుకోబోతున్నాడు-తెలుసుగా?" అని.

సుబ్బారావు వెకిలిగా నవ్వి, "అవునట, ఆఫీసులో అనుకొంటున్నారు" అన్నాడు.

"ట, అంటున్నావు, నీకు తెలియదా?"

"వాళ్ళిద్దరూ మాట్లాడుకొంటూ ఉండగా ఆఫీసులో చాలాసార్లు చూశాను. గురువుగారూ, ఈ సారన్నా ఆమె పెళ్ళి జరిగితే అంతకన్నా కావలసిందేమీ లేదు. మంచి పిట్టనే పట్టింది." ఈర్ష్య ధ్వనించింది అతని కంఠంలో.

"నువ్వంతగా ఆమె శ్రేయస్సు కోరుతున్న వాడివైతే నాకు అంత కన్నా కావలసిందేమీ లేదు. కానీ మీ పాత అఫైర్ గురించి ఈ సమయంలో నువ్వు ఎక్కడా మాట్లాడకుండా ఉండటం నాకు కావలసింది."

సుబ్బారావు కన్నుకొట్టి నవ్వాడు. "ఏం, గురువుగారూ, ఉన్నట్టుండి ఆవిడ మీద ఇంటరెస్టు పుట్టింది?"

కోపాన్ని అతికష్టం మీద అణచుకొన్నాను. "ఎందుకంటే....,, పళ్ళు బిగపెట్టి అన్నాను- "నీ తెలివితక్కువతనాన్ని సంవత్సరం క్రితం చూశాను కాబట్టి, ఆ అమ్మాయి మంచితనాన్ని సంవత్సరం నుంచీ చూస్తూన్నాను కాబటి."

సిగరెట్ పొగని నిర్లక్ష్యంగా వదిలాడు సుబ్బారావు. "సర్లెండి. ఈ అఫైర్ సంగతి భాస్కర్రావుకి తెలియనివ్వనులెండి" అన్నాడు.

"భాస్కర్రావు ఒక్కడికే కాదు, ఎవ్వరికీ. మరో మూడు కంటికి తెలియకూడదు! ప్రస్తుతం నీ మానసిక పరిస్థితి నేను అర్థం చేసుకోగలను ఈ స్థితిలో నువ్వు ఏ మాత్రం నోరు జారినా ఓ నిండు జీవితం బలై పోతుంది."

మందు బాగా తలకెక్కినట్టుంది. వ్యంగ్యంగా నవ్వుతూ, "ఏం గురువుగారూ, సావిత్రిని వెనకేసుకొస్తున్నారు-ఏమిటి సంగతి?" అన్నాడు.

అతని కాలరు పట్టుకొని విసురుగా దగ్గరికి లాగాను. బిత్తరపోయాడు. ఈ హఠాత్ సంఘటన నుంచి అతను తేరుకోకముందే అన్నాను, "చూడు, సుబ్బారావ్! ఎక్కడో పల్లెటూల్లో చదువుకొని ఇక్కడికొచ్చావు. హైదర్ గూడా రౌడీల గురించి నీకు బాగా తెలిసినట్టు లేదు. బీ కేర్‌పుల్!'

నా బెదిరింపు సుబ్బారావు మీద ఎలా పనిచేస్తుందో నేను ఊహించగలను. నేను ఊహించలేనిది మరొకటి.

* * *

స్త్రీ వీణ లాటిదనీ, ఎలా మీటితే అలా పలుకుతుందనీ ఎవరో కవి అన్నాడు. సావిత్రిపట్ల ఆ మాట నిజం అయింది. భాస్కరరావు స్నేహముతో ఆమె చాలా మారిపోయింది. పూర్వపు నెమ్మదీ, మందకొడితనమూ స్థానే హుషారూ, చొరవా స్థానం చేసుకొన్నాయి. పోతే భాస్కర్రావు సావిత్రితో తన స్నేహాన్ని దాచే ప్రయత్నం ఏమీ చెయ్యలేదు. ఆఫీసులో వాళ్ళు సరదాగా మాట్లాడుకోవటం నా కంట అప్పుడప్పుడు పడేది.

భాస్కర్రావు నిస్సందేహంగా సావిత్రిని ప్రేమిస్తున్నాడనేది ఖాయం. అంతకు ముందు స్నేహితురాళ్ళ గురించి ప్రతి చిన్న విషయమూ నాతో చెప్పేవాడు. సావిత్రి విషయం మాటల సందర్భంలో ఎప్పుడొచ్చినా ఒక్కటే అనేవాడు - "షి ఈజ్ ఏ నైస్ గర్ల్ గురూ! అలాటి అమ్మాయిని ఈ కాలంలో చూడం".

నాకు నవ్వొచ్చేది. సావిత్రిలాంటి అమ్మాయిలు చాలామంది ఉన్నారు. ప్రేమ గుడ్డిదనటానికి ఇదొ ఉదాహరణ అనుకునేవాడ్ని. ఏది ఏమైనా సావిత్రి చాలా అదృష్టవంతురాలు. తొలి ప్రేమ విఫలం అయిన రోజుల్లో, అంతర్లీనంగా ఆమెలో గూడుకట్టుకొన్న విషాదాన్ని ఆమె కళ్ళ వెనుక గమనించినవాడిని - బహుశా నేనొక్కడ్నేనేమో? తొందరలోనే ఆ విషాదం నుంచి బయటకొచ్చి ఫ్రెష్‌గా కొత్త జీవితం అనుభవిస్తున్నందుకు ఆమెని అభినందించాలి.

నా బెదిరింపు వల్లనో, మరో కారణం చేతనే తెలియదు కానీ, సుబ్బారావు వైపు నుంచి కూడా ప్రమాదం యేమీ రాలేదు. ఇంకో వైపు మంచి వచ్చింది.

* * *

"నేను సావిత్రిని పెళ్ళి చేసుకోబోవటం లేదు...." అన్నాడు భాస్కర్రావు.

నిశ్చేష్టుడినయ్యాను. ఎలాగో గొంతు పెగుల్చుకొని, "ఎందుకు?" అన్నాను.

భాస్కర్రావు కుర్చీలో ఇబ్బందిగా కదిలి, "ఇప్పుడే చెప్పాలా?" అన్నాడు సంశయిస్తూ.

"వెంటనే" అరిచాను. నా కంఠం నాకే వికృతంగా వినిపించింది. ప్రక్క ఆఫీసరు కాగితాల మధ్య నుంచి తలయెత్తి మావైపోసారి చూసి మళ్ళీ తన పనిలో మునిగిపోయాడు. "చెప్పు భాస్కర్రావు" అన్నాను.

చేతి వేళ్ళ మధ్య పేపర్ వెయిట్ తిప్పుతూ ఆలోచనలన్నిటినీ కూడగట్టుకోవడం కోసమా అన్నట్టు క్షణం ఆగి, చెప్పటం ప్రారంభించాడు.

"నా సంగతి మీకు బాగా తెలుసు. నేనేం చెప్పనవసరం లేదు. స్త్రీ అంటే నాకు నమ్మకం లేదు ఒకప్పుడు. సరదాగా ఆడుకొనే ఆటవస్తువుగానే కనిపించేది. కానీ, సావిత్రి పరిచయంతో నాకు కావలసిందేదో దొరికిందనిపించింది. నా గురించి మీకు తెలుసుగా పైకి ఎంత అల్లరిగా కనబడినా, లోపల చాలా సెన్సిటివ్‌నని?"

"స్వోత్కర్ష వద్దు."

'సావిత్రిలో నాకు నచ్చినవి ఆమె నెమ్మదీ, ప్రేమపట్ల సిన్సియారిటీ. మొన్నటివరకూ ఆమె నా ఆరాధ్య దేవత.'

'ఏం నిన్నేం జరిగింది?' నాలో అగ్నిపర్వతం బ్రద్ధలవటానికి సిద్ధంగా వుంది.

"నాఆహ్వానం మీద నిన్న సాయంత్రం సావిత్రి నా రూమ్‌కి వచ్చింది తాపీగా పేపర్ వెయిట్ తిప్పుతూ అన్నాడు. యేమాత్రం ప్రతిఘటనా లేకుండా - దాని కోసమే ఎదురు చూస్తున్నట్టు నాకు లొంగిపోయింది. నా ఆశల్నీ, ఆలోచనల్నీ నిలువునా కూల్చేసి నన్నన్యాయం చేసింది." పైకి మామూలుగా మాట్లాడుతున్నాం, అతనిలో ఎంత కల్లోలం చెలరేగుతుందో, దాన్ని అణచుకోవటానికి అతనెంత కష్టపడుతున్నాడో మొహం చూస్తేనే తెలుస్తుంది.

"భాస్కర్రావ్! కంగారుగా యేదో అనబోయాను.

"వద్దు, వద్దు యేం చెప్పకు. చెప్పి నన్ను కన్విన్స్ చెయ్యటానికి ప్రయత్నించకు, ప్లీజ్!' ' అతని కంఠం రుద్ధమయింది. నేనింక ఆమెని పెళ్ళి చేసుకోలేను. ఈ అనుమానం నాలో ఎంత దూరం వెళ్ళిందంటే ఊహూఁ - చెప్పలేను' చేతుల్లో మొహం దాచుకున్నాడు. "సావిత్రి కూడా అందరమ్మాయిల్లాంటిదే. సావిత్రి కూడా....సా....వి....త్రి.... కూ....డా...."

*　　　　*　　　　*

"మన జీవితంలో క్లైమాక్స్ అంటే ఏమీలేదు. అది నిరంతర ప్రవాహం" అని నేనెక్కడో నాటకంలో ఒకసారి వాడాను. ఈ చిన్న ట్విస్టు చాలు సావిత్రి కథని ఇక్కడ ఆపు చెయ్యటానికి. కానీ, ఆమె జీవితాన్ని ఇంకొంచెం పరిశీలించి చూస్తే అది మరింత వ్యధాభరితం. వీళ్ళ సంగతి అందరికీ తెలియటం, భాస్కర్రావు ఆమెను చేసుకోబోవటం లేదని ప్రకటించటం, ఆ తరువాత సావిత్రి పదిహేను రోజులు సెలవు పెట్టటం - ఆఫీసులో మరింత కలజడికి కారణమయ్యాయి. సెలవయిన తరువాత ఆఫీసుకు వచ్చిన సావిత్రి, వెనుకచాటున గుసగుసల్నీ, వెక్కిరింతల్నీ చాలా ఎదుర్కోవలసి వచ్చింది. ఆ తరువాత పదిరోజులకి ఆమె

రిజైన్ చేసి వెళ్ళిపోయింది. కారణం - ఆఫీసులో పబ్లిక్‌గా ఆమెనెవరో "ఇంటికి రా, మా ఆవిడ లేదు...." అని ఆహ్వానిస్తే, ఆమె లాగి వాడి చెంపపగల గొట్టిందట. అది మేనేజ్‌మెంటుకి తెలియటం, చార్జిషీటు యివ్వటం - ఇదంతా భరించలేక ఆమె రిజైన్ చేసింది. చిత్రం ఏమిటంటే - ఆమెని అలా ఆహ్వానించినవాడు - నాతో సెన్సిటివ్‌నెస్ గురించీ, తొలిప్రేమ అర్పించుకోవటం గురించీ లెక్చర్లిచ్చిన సుబ్బారావు.

సావిత్రి ఖాళీ చేసిన సీట్లో రెండు నెలలు వరకు ఎవరినీ వెయ్యలేదు అటు వెళ్ళినప్పుడల్లా ఆ ఖాళీ కుర్చీ నాలో యేదో భావసంచలనాన్ని కలగచేసేది. దాన్ని బహిరంగ పరుస్తూ, ఆ సంఘటనల్ని, సావిత్రి మీద వాటి ప్రభావాన్నీ క్రోడీకరించి కథ వ్రాసి పత్రిక్కి పంపాను. నాలుగు నెలల తరువాత ఆ కథ ప్రచురితమయింది. అది సుబ్బారావులోనూ, భాస్కర్రావులోనూ, ప్రభావాన్ని కలుగచేసిందో నాకు తెలియదు. అప్పటికే మంచి ఉద్యోగం రావటంతో నేను ఆఫీసు వదిలేశాను.

* * *

"ఎందుకిలాంటి కథలు వ్రాసి అన్ పాపులర్ అవుతారు?" వారపత్రిక టేబుల్ మీద పడేస్తూ అంది కమల.

"అందులో నన్ను అన్ పాపులర్ చేసే విషయం ఏముంది?"

"వర్కింగ్ క్లాస్ గర్ల్స్ గురించి వ్రాసేటప్పుడు వాళ్ళ గురించి కొంచెం తెలుసుకోవాలి. సావిత్రిలాంటి అమాయకమైన స్పెసిమిన్స్ చాలా తక్కువ ఈ కాలంలో."

"సావిత్రి కథ నిజంగా జరిగిందే."

"అయి వుండవచ్చు కానీ, అలాంటి అమాయకులు చాలా తక్కువ. తక్కువగా ఉన్న స్వభావాల గురించీ, వ్యక్తుల గురించీ వ్రాయటం వృద్ధిలోకి వచ్చే రచయిత లక్షణం కాదు" కమల నవ్వింది.

"లేదు కమలా" ప్రక్కనే కూర్చుంటూ అన్నాను - "ఇది చాలా పెద్ద సమస్య. తమ భర్తల్ని తామే నిర్ణయించుకోవలసిన ఈ పరిస్థితుల్లో తల్లిదండ్రులు తమ కూతుళ్ళ వివాహం ఒక సమస్యగా తలపోసే ఈ వ్యవస్థతో - సావిత్రిలాటి అభాగినుల జీవితాలు అలా తెల్లవార వలసిందే. ఇంకో పరిష్కారం కనబడే అలా ముగించాను" నా కథల గురించి మాట్లాడేటప్పుడు భలే ఆవేశం వస్తుంది నాకు.

"ఏ మాత్రం తెలివితేటల్ని ఉపయోగించినా, ఈ ప్రాబ్లెమ్‌ని చాలా సులభంగా పరిష్కరించవచ్చు."

"ఎలా?"

ఆఫీసు నుంచి తెచ్చిన కూరగాయల సంచీ లోపలికి తీసుకువెళుతూ కమల అంది - "ఇలా" ఉలిక్కిపడ్డాను.

"ఏమీ అర్థం కాలేదు. కమల ఎలా ఈ సమస్యలని టాకిల్ చేసింది? రెండు నిమిషాలు దీర్ఘంగా ఆలోచించవలసి వచ్చింది. మా ప్రేమా, ఆ రోజులూ, వెన్నెల రాత్రులూ

చటుక్కున నా మెదడులో ఏదో మెరిసినట్లయింది....లోపలికి పరుగెత్తాను. కత్తిపీట ముందుకూర్చుని కూరలు తరుగుతున్న కమలని రెక్కపట్టుకొని లేవనెత్తాను.

"చెప్పు" సూటిగా చూశాను. "ఆ రోజు నా గదిలో నువ్వు నిజంగా మైకం వచ్చి పడిపోలేదు కదూ?"

కమల నవ్వి, సుతారంగా తన భుజం విడిపించుకొంటూ, "యిప్పటికి ట్యూబ్‌లైట్ వెలిగిందన్నమాట!" అంది.

షాక్ తగిలినట్టయింది. నిమిషం పాటు మాట్లాడలేకపోయాను. నా స్తబ్దత చూసి కమల బెదిరినట్టు దగ్గరగా వచ్చి, "ఏమండీ!" అంది, బేలగా.

"కమలా!" ప్రపంచంలో నైరాశ్యం అంతా నా కంఠంలోనే ధ్వనించింది. "డూ యూ లవ్ మి?"

దగ్గరకు వచ్చి మెడచుట్టూ చేతులు వేసింది. తలపైకెత్తి నావైపు చూసి, నెమ్మదించుకొని వక్షస్థలం మీద అని, అలానే ఉండిపోయింది.

చాలు. ఆ మౌనంలోనే నాకు కావలసిన జవాబు దొరికిపోయింది. మామూలు మనిషినైపోయాను. మళ్ళీ నా చిలిపితనం నన్నావరించింది. "ఇప్పటి సంగతి కాదోయ్, పెళ్ళి కాకముందు."

అరచేతిని తన చెంపకి రాసుకుంటూ, "దానికి 'ప్రేమ' అన్నంత పెద్దపదం ఎందుకు? అది ఆకర్షణ!" అంది.

ప్రాణులు తమ చుట్టూ ఉన్న పరిస్థితులను బట్టి వాటికి ఎదుర్కొనే రక్షణ కవచాలు తమంతట తామే స్వయంగా నిర్మించుకొంటాయనే థియరీ ఆఫ్ ఎవల్యూషన్‌ని కనిపెట్టిన సైంటిస్ట్ ఎవరు?

❀ ❀ ❀

**(ఆంధ్రప్రభ - 1983)**